క్లుప్తంగా

స్టడీ సర్కిల్ సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కుమురంభీం స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. స్టడీసర్కిల్‌లో శిక్షణ పొంది ఎస్సెస్సీ జీడీగా ఎంపికైన రెబ్బెన మండలం దుగ్గగూడకు చెందిన మడావి గంగును గురువారం జిల్లా కేంద్రంలోని స్టడీ సర్కిల్‌లో సన్మానించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ నిర్వాహకులు కాంపెల్లి ఊషన్న, రాజశేఖర్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఇందురావు, సర్పంచులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలి

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలకు కాకుండా అర్హులకు అందించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్ అన్నారు. గురువారం గోలేటిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మండలంలో బీసీ ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే అందిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అందించాల్సిన చెక్కులను లబ్ధిదారులకు ఫోన్లు చేసి పిలిపించుకుని నాయకులే అందజేస్తున్నారని ఆరోపించారు.

జిల్లా కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో జిల్లా స్థాయి అత్యపత్యా కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్కూర్ భీమ్‌రావు, కార్యదర్శిగా బొమ్మకంటి కరిన్, కోశాధికారిగా కడతల రమేశ్‌లను ఎన్నుకున్నారు.

నేడు గురు రాఘవేంద్ర స్వామి మహోత్సవం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం న్యూ కాలనీలో శ్రీ గురు రాఘవేంద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ గురు రాఘవేంద్ర స్వామి 352వ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.

రెండో విడత గొర్రెల పంపిణీ

దహెగాం: రెండో విడత గొల్లకుర్మలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న గొర్రెల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో గల లబ్ధిదారులకు ఏడు యూనిట్ల గొర్రెలను మండల రైతుబంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గొల్ల కుర్మలను ఆదుకోవడానికి గొర్రెలు పంపిణీ చేస్తున్నారన్నారు. పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై గురువారం ఎడవెల్లి గ్రామంలో పౌరసరఫరాల శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్యాంలాల్ మాట్లాడుతూ కొంతమంది లబ్ధిదారులు ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంలా భావిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మహిళలకు ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పించామన్నారు. రేషన్ డీలర్లు సైతం ఫోర్టిఫైడ్ బియ్యంపై కార్డుదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

హనుమాన్ దీక్షల స్వీకరణ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ మందిర్‌లో శ్రావణమాసపు హనుమాన్ ఏకాదశ దీక్షలు గురువారం ప్రారంభించారు. అర్చకుడు శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో 75 మంది భక్తులు మాలధారణ చేశారు. స్వాములకు నియమ నిబంధనలు వివరించారు. బీఆర్ఎస్ నాయకులు గాదెవేణి మల్లేశ్, కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, వివేక్, వెంకటేశ్, డాక్టర్ రమేశ్, మధూకర్ పాల్గొన్నారు.

కలర్‌ఫుల్ మష్రూమ్స్



కౌటాల: కాగజ్‌నగర్ అట వీ డివిజన్ పెద్దపులులు, 250కి పైగా రకాల పక్షులు, అరుదైన రాబంధులు, దట్టమైన అటవీ సంపద కు ప్రసిద్ధి పొందింది. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా కాగజ్‌నగర్ అడవుల్లోనే నీలిరంగు పుట్టగొడుగులను గుర్తించారు. ఈ రంగు మష్రూమ్స్‌కు న్యూజిలాండ్ పుట్టినిల్లు కాగా.. ఆ దేశ కరెన్సీపై సైతం పుట్టగొడుగుల చిత్రం ఉంటుంది. జిల్లాలో ఇదే సంవత్సరం ఆరెంజ్, పసుపు రంగుల పుట్టగొడుగులను సైతం గుర్తించారు. తాజాగా గురువారం కౌటాల మండలంలోని కన్నెపల్లి సెక్షన్‌లో నీలి, ఆకుపచ్చ రంగులు కలిసి ఉన్న ఉన్న మష్రూమ్స్‌ను అటవీశాఖ అధికారులు గుర్తించారు. కన్నెపల్లి అటవీప్రాంతంలో మరిన్ని అరుదైన జాతులు ఉండే అవకాశం ఉందని ఎఫ్‌బీవో ప్రభాకర్ తెలిపారు.



బెజ్జూర్: రాఖీ కడుతున్న చిన్నారి



వాంకిడి జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌కు రాఖీ కడుతున్న కోవ లక్ష్మి



దహెగాం: కేజీబీవీలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థినులు



రెబ్బెన: ఎమ్మెల్యే సక్కుకు రాఖీ కడుతున్న అన్నపూర్ణ అరుణ

ఘనంగా రక్షాబంధన్



పెంచికల్‌పేట్: అన్నకు రాఖీ కడుతున్న చెల్లి

సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకైన రాఖీ పండుగను జిల్లాలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మార్కెట్‌తో పాటు వివిధ మండలాల్లోని మార్కెట్‌లు కొనుగోలు దారులతో సందడిగా మారాయి. జిల్లాకేంద్రంలోని వివేకానందచౌక్, అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో రకరకాల రాఖీ దుకాణాలు వెలిశాయి. ఒక్కో రాఖీ రూ. 20 నుంచి రూ.100 వరకు విక్రయించారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న సోదరులకు రాఖీలు కట్టేందుకు ఆడపడచులు తరలి వెళ్లడంతో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. జిల్లాకేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తన నివాసంలో వాంకిడి జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్‌తో పాటు పలువురు ఆదివాసీ నాయకులకు, తన మనవడు అనిరుధ్‌కు రాఖీ కట్టారు. బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి రాఖీ కట్టారు. కౌటాల కేజీబీవీ పాఠశాలలో, కాగజ్‌నగర్‌లోని కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయంలో ఘనంగా రాఖీ వేడుకలు నిర్వహించారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సోనియా పోలీసులకు రాఖీ కట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



కెరమెరి: రాఖీలు కడుతున్న చిన్నారులు



కెరమెరి: రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు



కాగజ్‌నగర్‌లో సిబ్బందికి రాఖీలు కడుతున్న రూరల్ ఎస్సై సోనియా



ఆసిఫాబాద్: స్వీట్ తినిపిస్తున్న సిర్పూర్(యు) జెడ్పీటీసీ అరుణ



ఆసిఫాబాద్: అలిబిన్ అహ్మద్‌కు రాఖీ కడుతున్న కోవ లక్ష్మి



సిర్పూర్(టి): రాఖీ కడుతున్న చిన్నారులు



కౌటాలలో ..



కౌటాల: కేజీబీవీలో..

శ్రమదానంతో మత్తడి కట్టకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న రైతులు

బెజ్జూర్: మండలంలోని సిద్దాపూర్, ఎలకపల్లి, బెజ్జూర్ గ్రామాలకు చెందిన దాదాపు వంద మంది రైతులు గురువారం శ్రమదానం చేసి మత్తడి కట్టకు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల భారీగా వర్షాలు కురిసినప్పటికీ చెరువు కట్ట దెబ్బతినడంతో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదన్నారు. దీంతో పంటలకు సాగునీరు అందించలేకపోతున్నామని పేర్కొన్నారు. ఏటా ఇదే తంతు కొనసాగుతుందని విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కట్టకు శాశ్వత మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ధోని క్రికెట్ అకాడమీకి కాగజ్‌నగర్ క్రీడాకారులు

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల హైదరాబాద్ నాచారంలో ధోని క్రికెట్ అకాడమీ అండర్ –14 క్రీడాకారుల ఎంపిక నిర్వహించగా, కాగజ్‌నగర్‌కు చెందిన సాయికిరణ్, యువరాజ్ తహిలాని, త్రిశూల్ అనే ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కోచ్‌లు సలీం, విజయ్ సింగ్‌లు క్రీడాకారులను అభినందించారు.

కళాశాల భవనానికి భూమిపూజ

కెరమెరి: మండలంలోని మోడి గ్రామంలో ఇటీవల మంజూరైన కేజీబీవీ కళాశాల భవన నిర్మాణానికి గురువారం ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్‌కలాం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోహర్లే సుమన్‌బాయి, న్యానేశ్వర్, నాయకులు అమృత్‌రావు, భుజంగ్‌రావు, ఆత్రం లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

వలస గిరిజనులకు టికెట్ ఇస్తే సహించం



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

జైనూర్: వలస గిరిజనులకు ఆసిఫాబాద్ నియోజకవర్గ టికెట్ ఇస్తే సహించేది లేదని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు సెడ్మకి భగవంత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను మర్సుకోల సరస్వతీకి ఇవ్వాలన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు ఆడ సోనేరావు, దుర్వ కొద్దు, ఆత్రం దేవు, గోడం జంగుబాయి, కొడప మోతుబాయి, మెస్రం శేకు, మడావి మనోహర్, మెస్రం మక్కు, ఉర్వేత జంగు, కుర్సెంగ ప్రకాశ్, గేడం మారుతి తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణలో అందించే సేవలతో గుర్తింపు



లక్ష్మణ్‌రావును సన్మానిస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన: సంస్థలో పని చేసే సిబ్బంది విధి నిర్వహణలో అందించిన సేవలే చిరస్మరణీయంగా నిలిచిపోతాయని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ గురువారం పదవీ విరమణ పొందిన లక్ష్మణ్‌రావుకు జీఎం కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పర్సనల్ మేనేజర్‌తో పాటు పర్సనల్ డిపార్టుమెంట్‌లో ఈడీపీ అసిస్టెంట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన పురుషోత్తమ రఘును సైతం ఏరియా అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమాల్లో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మార్‌రాజు శ్రీనివాస్‌రావు, ఎస్‌వోటూజీఎం నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కైరిగూడలో రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం..

బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీలో గురువారం పదవీ విరమణ పొందిన డిప్యూటీ సూపరింటెండెంట్ డి. ప్రభాకర్, పంప్ ఆపరేటర్ సంకుల రాయలింగు, కన్వేయర్ ఆపరేటర్ దుర్గం శ్యాంరావ్, జనరల్ మజ్దూర్ చెన్న సాంబయ్య, ఈపీ ఆపరేటర్ దానమనేని నర్సింగ రావులను పీవో సత్యనారాయణ, ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు, డీవైపీఎం వేణులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఫిట్‌కార్యదర్శి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో తిప్పలు

- ఆరు నెలల క్రితం వేసిన రోడ్లకు పగుళ్లు
- నాణ్యతా ప్రమాణాలు గాలికి
- పట్టించుకోని అధికారులు
- గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కౌటాల: మయూరి విద్యాలయం కాలనీలో కంకర తేలిన సీసీ రోడ్డు

కౌటాల: బురద రోడ్డుతో నానా అవస్థలు పడిన స్థానికులకు కొత్త రోడ్డు వేశారన్న ఆనందం ఆరు నెలల్లోపే ఆవిరైంది. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో, మండలంలోని ఆయా గ్రామాల్లో మార్చి, ఏప్రిల్ నెలల్లో సీసీరోడ్లు వేశారు. కాగా ఆరు నెలలు గడవకముందే రోడ్లు పగుళ్లు తేలుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాసిరకం పనులకు తోడు రోడ్డు వేసిన అనంతరం సక్రమంగా నీరు పట్టకపోవడంతో రోడ్డు నిర్మాణం మూడునాళ్ల ముచ్చటగా మారిందని వాహనదారులు, కాలనీలవాసులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలంలోని కాలనీల్లో సీసీరోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రభుత్వం సీసీరోడ్ల నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు కేటాయించగా రోడ్డు పనులు పూర్తి చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. నాసిరకంగా పనులు చేపట్టడంతో రోడ్లపై కంకర తేలుతుందని స్థానికులు మండిపడుతున్నారు.

ఇష్టారాజ్యంగా పనులు..

మండలంలో ఈసారి దాదాపు చాలా కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించారు. బయట మార్కెట్‌లో నాణ్యమైన సిమెంటు బస్తా ధర రూ. 325గా ఉంది. కాని గుత్తేదారులు తక్కువ ధరకు లభించే సిమెంటును వినియోగించడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. నాణ్యత లేని సిమెంట్ వాడకంతో రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేకుండా పోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రగతి కాలనీ, మయూరి కాలనీల్లో వేసిన సీసీ రోడ్లపై గుంతలు పడుతున్నాయి. పలుచోట్ల పగుళ్లు రావడంతో పాటు మరికొన్ని చోట్ల అంచులు కోతకు గురవుతున్నాయి. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

అమలు కాని నిబంధనలు

ఉపాధిహామీ, గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్లు నిర్మించారు. దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. సీసీ రోడ్డు నిర్మించే చోట 1:3:6 నిష్పత్తిలో సిమెంటు, ఇసుక, కంకర మిశ్రమం వాడాలి. నిర్దేశిత కొలతల మేరకు, భూమి స్వభావాన్ని అనుసరించి తవ్వి టార్పాలిన్ కవర్‌ను ఉంచాలి. దీనిపై 15 సెం.మీ. ఎత్తుతో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేసి, 15 రోజుల పాటు నిత్యం ఉదయం, సాయంత్రం నీళ్లు పట్టాలి. ఈ నిబంధనలు పాటించకపోవడంతోనే రోడ్లు తక్కువ కాలంలోనే ధ్వంసమవుతున్నాయని మండలవాసులు చెబుతున్నారు. నాసిరకంగా పనులు చేపట్టిన సదురు గుత్తేదారుపై చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డు పగుళ్లు తేలిన చోట మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే పనులు

నిబంధనల ప్రకారమే ఇటీవల గ్రామాల్లో సీసీ రోడ్లు పనులు పూర్తి చేశాం. మండలంలో రూ. 2.50 కోట్ల నిధులతో సీసీ రోడ్లు వేశాం. రోడ్డు నిర్మాణంలో నాసిరకంగా పనులు చేస్తే రికవరీ చేస్తాం. రోడ్లను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– ఆత్మారాం, పంచాయతీరాజ్ అధికారి, కౌటాల

పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆనందరావు

కెరమెరి: మండల కేంద్రంలో పబ్లిక్ మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి కూటికల ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు నిత్యావసర సరుకులు, ఇతర అవసరాల నిమిత్తం వస్తుంటారని ఈనేపథ్యంలో టాయిలెట్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి టాయిలెట్స్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట ఇసాక్, నబి, నిఖిల్, శ్రీకాంత్, అయ్యూబ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా యజ్ఞోపవీతధారణ మహోత్సవం



యజ్ఞోపవీత ధారణ నిర్వహిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ కాలనీలోని శ్రీ ఉమా మహేశ్వర మార్కండేయ దేవాలయంలో సామూహిక యజ్ఞోపవీత ధారణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున పద్మశాలీ కులస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమం, అభిషేకంతో పాటు గాయత్రి యజ్ఞం నిర్వహించి సామూహిక యజ్ఞోపవీత ధారణ చేశారు. అనంతరం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ నిర్మాణానికి ఎంపీపీ తుల శ్రీనివాస్ రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం పిప్పల్‌ధరి సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్‌లు అందజేశారు.